క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ప్రకటించారు.

▸▸ ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ మంతెన గార్డెన్స్‌లోని వీధులు, సంగీత వెంకట రెడ్డి స్ట్రీట్, భాను టెక్స్‌టైల్స్ స్ట్రీట్, ప్రగతి మార్గ్, షిరిడీ సాయిమార్గ్, జయశ్రీ గార్డెన్స్, కోకా భాస్కరమ్మ నగర్, పిల్లివారి స్ట్రీట్, జేఎన్ రోడ్, తోట రాములు నగర్, శ్రీనివాస నగర్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారద నగర్, షీలానగర్, గోపాలనగర్ పుంత, అద్దేపల్లి కాలనీ, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, వాకర్స్ రోడ్, ఏవీ అప్పారావు రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధులు, కాంచన నగర్, బైబిల్ ప్లేస్, వాకర్స్ రోడ్, డీవీబీ రాజు స్క్వేర్ 62 ప్లాట్లు, విద్యుత్ కాలనీ, వేంకటేశ్వర నగర్, గెయిల్ ఆఫీస్ ఏరియా, ఆల్ బ్యాంకు కాలనీ, వీఎల్ పురం, తిలక్ రోడ్, కోనేరుపేట, సాయి బృందావన్ కాలనీ, మోరంపూడి సెంటర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

▸▸ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రామచంద్రరావు పేట, కోర్లంపేట, ఆర్యాపురం, సాంబశివరావుపేట, సీతంపేట, ఈఎస్ఐ హాస్పిటల్ ఏరియా, కోటిలింగాల పేట, అన్నపూర్ణమ్మపేట, అశోక థియేటర్ ఏరియాలో అంతరాయం కలుగుతుంది.

సంతృప్తికర సేవలందించాలి

కడియం: రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూశాఖ ప్రధానమైనదన్నారు. ప్రభుత్వం ఆదేశించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ, ప్రజల్లో మంచిపేరు తెచ్చుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఇటీవల జరిగిన ఎన్నికల్లో అత్యుత్తమ సేవలందించినందుకుగాను తహసీల్దార్ రమాదేవి ఉన్నతాధికారుల అభినందనలు అదుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆమెను అభినందించారు. అలాగే సీనియర్ వీఆర్వోలను రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సత్కరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పేద విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. క్వారీ ఏరియాలోని పేద విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించి, పేద విద్యార్థుల ఉన్నత చదువుకు కృషి చేశారన్నారు.

స్టూడెంట్స్ కిట్స్ పరిశీలన



స్టూడెంట్ కిట్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: స్టూడెంట్ కిట్స్‌ను త్వరగా రెడీ చేసి పంపిణీ చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆదేశించారు. ఆయన గురువారం కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడి స్టూడెంట్ కిట్స్‌ను పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు బి.రత్నకళ తెలిపారు. అనంతరం డీఎస్ఈవో తరగతులను పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. యూ డైస్ లో ప్రోగ్రెషన్ మాడ్యూల్‌ను వెంటనే పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నర్సరీ సమస్యలు

కడియం: రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి నర్సరీ రంగ సమస్యలను తీసుకువెళ్లినట్టు నర్సరీ రంగ ప్రముఖులు, టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, వీరబాబు తెలిపారు. అమరావతిలో మంత్రిని కలిసి ఈ మేరకు విన్నవించామన్నారు. ప్రధానంగా నర్సరీ రుణాలపై మార్టిగేజ్ ఫీజులు రైతులకు భారంగా మారాయని, వాటిని సమీక్షించాలని కోరామన్నారు.

పీఎంపీల సమావేశం

కంబాలచెరువు: స్థానిక ఆనంద రీజెన్సీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తోరాటి ప్రభాకరరావు, యూటీటీ రాజు మాట్లాడుతూ ప్రాథమిక చికిత్స అందించే పీఎంపీలను గుర్తించి, గ్రామాల్లో సామాజిక వైద్య సహాయకులుగా ఉపయోగించుకుంటామని హామీ ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గోదారి తీరంలో నాట్య తరంగం

- ఆనం కళాకేంద్రంలో కళాసమ్మేళన్ ప్రారంభం
- పుష్కరఘాట్‌లో నాట్య ప్రదర్శన
- ఆకట్టుకున్న కార్యక్రమాలు





నందిగేశ్వర్ అకాడమీ కళాకారుల ప్రదర్శన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం గురువారం సంగీత, నాట్య ప్రదర్శనలతో తడిసి ముద్దయ్యింది. శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రాధాకృష్ణ కళాక్షేత్ర, రాధాకృష్ణ ట్రస్టు ద్వారా అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మరోపక్క పుష్కర ఘాట్‌లో నందిగేశ్వర్ డాన్స్ మ్యూజిక్ అకాడమీ మలేషియా వారిచే భరత నాట్య ప్రదర్శన సంగీత ప్రియులను కట్టిపడేసింది.

సంగీత పోటీలు ప్రారంభం

ఆనం కళాకేంద్రంలో నగర పాలక సంస్థ, గెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో కళా సమ్మేళన్ ప్రారంభమైంది. నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత, నృత్య పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు రాధాకృష్ణ కళాక్షేత్రకు చెందిన కళాకారులు ఆరంగ్రేటం చేశారు. కార్యక్రమంలో బీవైఎస్ఎస్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ రోషన్ గుప్తా, బీవైఎస్ఎస్ మహిళా మోర్చ అధ్యక్షురాలు రాజ్ బాలసింగ్, జి.ఉమా జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. కాగా.. శుక్రవారం 150 మంది



ఆనం కళాకేంద్రంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

చిన్నారులు కనకధార స్తోత్రాన్ని 16,200 సార్లు పఠిస్తూ నృత్యం చేస్తారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 వరకూ దాదాపు 13 గంటలు నిర్విరామంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

పుష్కరఘాట్‌లో..

భరతకళ శిఖామణి, ఆడల్ అరసు గురుశ్రీ డాక్టర్ చంద్రమోహన్ రామస్వామి ఆధ్వర్యంలో మలేషియా నుంచి వచ్చిన కళాకారులు తమ నాట్య ప్రతిభతో గోదావరి తీరంలో ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. భరత నాట్య ప్రదర్శనలో గురుశ్రీతో పాటు ఆయన శిష్యులు పాదం కలిపి వీక్షకులను ఆనంద డోలికలలో తెలియాడేలా చేశారు. ఒక పక్క గోదావరి హోరు, మరోపక్క నాట్యాకళాకారులు నాట్య ప్రదర్శనతో ఆ ప్రాంతం మార్మోగింది. అన్నవరం సత్యానారాయణ స్వామి స్వామి దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, అసిస్టెంట్ కమిషనర్ వీవీ పల్లంరాజు సౌజన్యంతో ఈ భరతనాట్య ప్రదర్శన జరిగింది.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాల మెరుగు



రంగంపేట హైస్కూల్లో విద్యార్థులకు ఇంకుడు గుంతపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: ఇంకుడుగుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు మెరుగు పడతాయని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని, వాడుక నీటిని పెరటి మొక్కలకు, ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చర్యలు చేపడితే భూగర్భ జలాలు పెంచుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత తవ్వి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నీటి పొదుపుపై నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధ, వీసీ జాకబ్, భారతి, సత్యదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

కంబాలచెరువు: దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజమండ్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ నీట్ పరీక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సంకీర్ణ ప్రభుత్వం లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుందని ఆరోపించారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించారన్నారు. చివరకు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేశాక విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారన్నారు. అంతే తప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామని గానీ, అభ్యర్థులకు న్యాయం చేస్తామని కానీ తెలపలేదన్నారు. కేంద్రం ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కొవ్వూరు: ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం తమవంతు కృషి చేయాలని, సమాజాన్ని నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం యాంటీ డ్రగ్స్ వారోత్సవాల సభ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలను దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైతే కలిగే దుష్పరిణామాలు, చట్టాలు, శిక్షలను వివరించారు. డ్రగ్స్ వాడకం ద్వారా సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. దేశ భవిష్యత్తును కుంగదీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సతీష్, ఇతర అధ్యాపకులు, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యురాలు డి.సత్య కుమారి, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.విజయలక్ష్మి, బి.ఉదయభవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో పతనమే..

దేవరపల్లి: వ్యక్తి మత్తు పదార్థాలకు బానిసైతే అతడి పతనావస్థ ప్రారంభమవుతుందని ఎస్ఈబీ దేవరపల్లి సీఐ కె.వెంకటేశ్వరస్వామి అన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై స్థానిక ప్రైవేటు స్కూలు విద్యార్థులకు ఎస్ఈబీ అధికారులు అవగాహన కల్పించారు. సీఐ కె. వెంకటేశ్వరస్వామి మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, హాసిస్ వంటి డ్రగ్స్‌కు బానిసలైతే కలిగే దుష్ఫలితాలను వివరించారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన నారుమడి



కానూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నర్సింహారావు

పెరవలి: ఆకుమడులు త్వరగా మొలకెత్తాలనే ఉద్దేశంతో రైతులు ఎరువులు అధికంగా వేయటం, తెగుళ్ల నివారణ కోసం విచక్షణా రహితంగా పురుగు మందులను వినియోగించటం మంచిది కాదని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చల్లా వెంకట నర్సింహారావు అన్నారు. సక్రమమైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే చాలని చెప్పారు. మండలంలోని కానూరు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రీచ్ యువర్ పంచాయతీ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ఏరువాక శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది. రైతులకు నారుమడి, ఎరువుల యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు.

యాజమాన్య పద్ధతులివే..

సార్వా పంటకు నారుమడి వేసే 10 రోజుల ముందే దమ్ముచేసి, చేనును చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి అనువుగా బోదెలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లే ముందు, ఆ తర్వాత విత్తిన 12 రోజులకు మరో కిలో చల్లాలి) ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను దుక్కిలోనే వేయాలి. విత్తనాలు చల్లిన తర్వాత మొలక వచ్చిన అనంతరం ఒక ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరుతడులు నీరు ఇచ్చి, ఆ తర్వాత పలచగా నీరును కట్టాలి. నారుమడిలో జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు గుళికలను వేయాలి. అలాగే నాట్లు వేసేటప్పుడు నారు కట్టలుగా ఉన్నప్పుడే నారు ఆకుల చివర్లను తుంచి నాట్లు వేయాలి. దీని వలన ఆకులపై ఉన్న తెగుళ్ల కారకాల గుడ్డు ముద్దలు నాశనం అవుతాయి. ఈ విధంగా నారుమడిని పెంచి నాట్లు వేసుకుంటే పంటకు తెగుళ్ల బెడద ఉండదు. నారుమడి వేసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలి. అందుకు కిలో విత్తనానికి కార్బండిజం 25 శాతం, మాంకోజెబ్ 50 శాతం మిశ్రమ శిలీంధ్ర నాశిని 2 గ్రాముల చొప్పున నీటిలో కరిగించి విత్తనానికి పట్టించాలి. ఈ విధంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన నారుమడితో పాటు తెగుళ్ల బెడద అంతంతమాత్రంగా ఉంటుందని శాస్త్రవేత్తల బృందం వివరించింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమాజ్యోతి, సర్పంచ్ బి.మధుపూర్ణచందు, రైతు ముళ్లపూడి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పడమర సిందూరం



రాజానగరం - ఫరిజిల్లిపేట దారిలో ఎర్రబడిన ఆకాశం

రాజానగరం: సంధ్యా సమయంలో పక్షులన్నీ గూళ్లకు చేరే వేళలో ఆకాశం ఎర్రబడింది. సూరీడు పడమటకు వెళుతూ సిందూరాన్ని ఆరబోసినట్టుగా ఎర్రబడిన ఆకాశం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది. రాజానగరం నుంచి ఫరిజిల్లిపేట వెళ్లే దారిలో గురువారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యం కనువిందు చేసింది.

యోగాసనం.. వీరికి సునాయాసం

- శ్రీనివాస రామానుజన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్ర, జాతీయస్థాయిలో పథకాలు
- నేడు జాతీయ యోగా దినోత్సవం



యోగాసనాలు వేస్తున్న రామానుజన్ పాఠశాల విద్యార్థులు (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోటలోని శ్రీనివాస రామానుజన్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల యోగాకు చిరునామాగా మారింది. ఈ పాఠశాల విద్యార్థులు యోగాసనాల పోటీలలో ఎనిమిదేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.సంజయ్ కుమార్, ఎం.భవిత మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన ఎన్‌సీఈఆర్‌టీ నేషనల్ యోగా ఒలింపియాడ్ 2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్ నుంచి పాల్గొన్నారు. 2024లో జైపూర్‌లో జరిగిన అండర్ 14 బాయ్స్ అండ్ గరల్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా నేషనల్ యోగా పోటీలలో ఎం.సంజయ్ కుమార్, పదో తరగతి విద్యార్థిని పి.దయాన తనుశ్రీ రాష్ట్రం నుంచి పాల్గొన్నారు. అగర్తలాలో జరిగిన అండర్ 17 బాయ్స్ అండ్ గరల్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా నేషనల్ యోగా పోటీలలో పదోతరగతి విద్యార్థిని బి.శరణ్య రాష్ట్రం నుంచి పాల్గొంది. వీరందరూ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, యోగా కోచ్ జె.రాజ్‌కుమార్ నేతృత్వంలో యోగాసనాలలో శిక్షణ పొందుతున్నారు. వీరితో పాటు పూర్వపు విద్యార్థులు డి.ప్రవల్లిక, ఎన్.దివ్యలక్ష్మి, కె.ఉష, జి.రాధికా దేవి, యశ్వంత్ దుర్గేష్, హరితశ్రీ సైతం డిల్లీలో జాతీయస్థాయి పోటీలలో పాల్గొని రాణించారు. కోచ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులతో యోగాసనాలను సాధన చేయిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీకేఎస్ సత్యవతి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎం.శ్రీదేవి, సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకారం మరువలేనిదన్నారు.



శరణ్య



సంజయ్‌కుమార్



దయానా తనుశ్రీ

మత్తు పదార్థాలతో అనేక అనర్థాలు

మధురపూడి: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ బంగారురాజు అన్నారు. కోరుకొండలోని సృజన మోడల్ జూనియర్ కాలేజీలో గురువారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ బంగారురాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. కాలేజీ కరస్పాండెంట్ ఏడుకొండలు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలనే లక్ష్యంగా విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి నిరంతర పోరాటం



సూర్యారావుపేటలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న

రాజానగరం: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడం, వారి అభ్యున్నతికి కోసం ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) 50 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న అన్నారు. సంఘ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి అధ్యక్షతన గురువారం సూర్యారావుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసన్న మాట్లాడుతూ 50 ఏళ్ల పోరాటాన్ని, సాధించిన విజయాలను వివరించారు. ఈ పోరాటాల ఫలితమే మహిళల రక్షణ కోసం వచ్చిన చట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, కార్యదర్శి పి. వెంకటనాయుడు, పీఓడబ్ల్యూ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం రాజమహేంద్రవరం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ పరిశీలించారు. అక్కడ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లను పరిశీలించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరిస్తున్న సెబ్ సీఐ రాంబాబు

రంగంపేట: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ ఎస్.రాంబాబు సూచించారు. మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మాధురి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.రాంబాబు మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ అనగా గంజాయి, నల్ల మందు, బ్రౌన్ షుగర్, మరియు సింథటిక్ డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ అలవాటు అత్యంత ప్రమాదకరమన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడినవారి మెదడు మొద్దుబారి విచక్షణ కోల్పోతారని చెప్పారు. అందుకే మాదక ద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కావొద్దని, జీవితంలో లక్ష్యం ఏర్పరచుకుని అది సాధించేందుకు కృషి చేయాలన్నారు. మత్తు, మరియు మాదక ద్రవ్యాల సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలన్నారు. మత్తు పదార్థాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ చిన్నారావు మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ వాడటం వల్ల అనారోగ్యం పాలై వారి నరాల వ్యవస్థతో పాటు కాలేయం, గుండె, ఊపిరితిత్తులు వంటి అవయవాలు పాడైపోయి మరణిస్తారన్నారు. ఇటువంటి చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులు, పెద్దలు చెప్పే విషయాలు అర్థం చేసుకుని మంచి సమాజం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ జి.అనిల్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	:	ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యమినీ	:	నింద
సూర్యప్యాలెస్	:	హరోంహర
స్వామి	:	మహారాజ
శివజ్యోతి	:	ఏ
అనుశ్రీ	:	మనమే
రాజా	:	బ్యాడ్ బాయ్స్
ఊర్వశి	:	అంతిమ తీర్పు
రంభ	:	కేజీఎఫ్ -1
మేనక	:	ప్రేమకథాచిత్రమ్
అప్సర	:	ప్రభుత్వ జూనియర్ కళాశాల
కుమారి	:	హనీమూన్ ఎక్స్‌ప్రెస్



నామవరం

వీఎస్ మహల్	:	మహారాజ

ధవళేశ్వరం

మురళీకృష్ణ	:	మహారాజ

రైతులకు అన్ని విధాలా సహకారం

మధురపూడి: ఖరీఫ్ సాగుకు సమాయత్తమైన రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించడానికి సిబ్బంది సిద్ధం కావాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు అన్నారు. కోరుకొండలోని సమీకృత పరీక్షా కేంద్రంలో సిబ్బందికి గురువారం ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి నమూనాలను త్వరితగతిన సేకరించాలన్నారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ సందర్భంగా పలు మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, గోకవరం ఏవో రాజేశ్వరి పాల్గొన్నారు.